## యూనియన్‌కు కార్యాలయం కేటాయించండి



జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్‌కు వినతిపత్రం అందిస్తున్న మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్, కృష్ణ

ఖైరతాబాద్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న తమ యూనియన్‌కు హెడ్ ఆఫీసులో కార్యాలయం కేటాయించాలని తెలంగాణ జీహెచ్ఎంసీ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ కమిషనర్‌ను కోరారు. గురువారం యూనియన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, అధ్యక్షుడు మిద్దె కృష్ణ ఆధ్వర్యంలో ప్రతినిధులు జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్‌ను కలిసి యూనియన్ కార్యకలాపాలపై మాట్లాడారు. 13 సంవత్సరాలుగా కార్మికుల శ్రేయస్సుకు పనిచేస్తున్న తమ యూనియన్‌కు కార్యాలయాన్ని కేటాయించాలని వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సలహాదారులు గడ్డం రవి, ప్రధానకార్యదర్శి మహేందర్, ప్రతినిధులు రాకేష్, శివకుమార్ ఉన్నారు.

## రామకృష్ణానగర్‌లో అధికారుల పర్యటన

ఖైరతాబాద్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ సర్కిల్ అధికారులు గురువారం రామకృష్ణానగర్ బస్తీలో పర్యటించారు. సర్కిల్-17 ఉపకమిషనర్ జగన్ ఆధ్వర్యంలో అధికారులు స్థానికులతో మాట్లాడారు. మంచినీరు సరిగ్గా రావడం లేదని కొందరు, చెత్తను తొలగించడంలేదని, వీధి దీపాలు సరిగ్గా వెలగడం లేదని మరికొందరు ఫిర్యాదు చేశారు. ఇందులో సర్కిల్ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ, డీఈ చైతన్య, ఎంటమాలజీ విభాగం అధికారి భాస్కర్ పాల్గొన్నారు.

## బీజేపీ ఇంటింటి ప్రచారం

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జూబ్లీహిల్స్ నాయకులు వెంగళరావునగర్‌లో గురువారం గావ్ చలో అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వెంగళరావునగర్‌లోని బూత్ నెంబర్ 97లో బూత్ అధ్యక్షుడు సురేష్ ఆధ్వర్యంలో ప్రవాసి కార్యకర్త బడుగు సతీష్ పర్యవేక్షణలో ఇంటింటికీ తిరిగి బీజేపీ ప్రభుత్వం పదేళ్లలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, పథకాల గురించి వివరించారు. ఇందులో భాగంగా ఆల్ ఇండియా రేడియో విశ్రాంత ఉద్యోగి పి.లక్ష్మీనారాయణను వారి నివాసంలో కలిసి సలహాలను తీసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భానుతేజ, రాము తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలి : కాంగ్రెస్ శ్రేణులు



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సనత్‌నగర్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో సనత్‌నగర్ నియోజకవర్గంలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి అడ్డుగా బీఆర్ఎస్ నాయకుల ఫ్లెక్సీని పెట్టి అవమానించారని, వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు నరేష్, ఎలిసా, విజయ్‌లు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకుల చర్యను ఖండిస్తూ ప్రజాస్వామ్య పద్ధతిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేసి, స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అయినా ఆ కేసులో పురోగతి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసన తెలిపినందుకు కాంగ్రెస్ నాయకులపైనే పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. ఇలాంటి తప్పుడు కేసులకు తాము భయపడేది లేదని, అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడుతుంటామన్నారు. అంతేకాకుండా గురువారం మోండా మార్కెట్ పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశామన్నారు. ఈ సందర్భంగా సనత్‌నగర్ స్వామి టాకీస్ సమీపంలో బీఆర్ఎస్ నాయకుల దిష్టిబొమ్మను దహనం చేశారు.

## శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి



సీఐ ఆదిరెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

ఎర్రగడ్డ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలను పరిరక్షించడంలో నాయకులు, స్థానిక సంఘాల సహకారం తప్పనిసరిగా ఉండాలని బోరబండ పోలీస్‌స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.ఆదిరెడ్డి అన్నారు. ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన ఆయనను ఎర్రగడ్డ పలు బస్తీ సంఘాలు, కాంగ్రెస్ నాయకులు గురువారం కలిసి అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎర్రగడ్డ డివిజన్ అధ్యక్షులు దూడల రవిగౌడ్, నాయకులు మహ్మద్‌మోసిన్ ఖురేషి, రమేష్ నాయక్, పేగడ ఆకాష్, గణేష్, సుభాష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు గర్భిణులకు ఉచిత వైద్య శిబిరం

ఎర్రగడ్డ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పేద గర్భిణుల కోసం నీలిమ హాస్పిటల్ 'నీలిమ9' పేరుతో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తోందని ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నీలిమాశ్రీనివాస్ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో పేరు నమోదు చేయించుకున్న వారికి ఉచితంగా మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు. గర్భిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

## సత్యాగ్రహ దీక్ష చేస్తే కేసులు పెడతారా?

### మార్కెట్ పోలీస్ స్టేషన్‌లోకి దూసుకెళ్లిన కాంగ్రెస్ కార్యకర్తలు



ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడుతున్న కోట నీలిమ

రెజిమెంటల్‌బజార్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సమయంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహానికి అడ్డుగా బీఆర్ఎస్ ఫ్లెక్సీలు కట్టిన వారిపై కేసు నమోదు చేయాలని సత్యాగ్రహ దీక్ష చేసిన తనపై కేసులు నమోదు చేయడం అన్యాయమని కాంగ్రెస్ సనత్‌నగర్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కోట నీలిమ అన్నారు. గురువారం సుమారు 150 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో మార్కెట్‌పోలీస్ స్టేషన్‌లో ధర్నా చేశారు. మోండా మార్కెట్ ఇందిరాగాంధీ విగ్రహం వైపు నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో ర్యాలీగా వచ్చిన కోట నీలిమ మార్కెట్ పోలీస్ స్టేషన్ లోపలికి దూసుకెళ్లడంతో ఉద్రిక్తత ఏర్పడింది. అప్రమత్తమైన పోలీసులు పోలీస్‌స్టేషన్ ప్రధాన ద్వారం డోరు మూసివేసి అడ్డుకున్నారు. ఫ్లెక్సీలు కట్టిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలుపాలని, సత్యాగ్రహ దీక్షచేసిన తనపై కేసులు నమోదు చేయడంపై కోట నీలిమ ఇన్‌స్పెక్టర్ రామక్రిష్ణను ప్రశ్నించారు. ఫిబ్రవరి 5న హాజరుకావాలని ఉన్న నోటీస్‌ను ఉద్దేశ పూర్వకంగా ఆలస్యంగా పంపించడం వల్ల ఫిబ్రవరి 7న చేరిందని ఆరోపించారు. తనపై ఏడు కేసులు నమోదు చేశారని కోట నీలిమ తెలిపారు. ఎన్నికల సమయంలో ఫ్లైయింగ్ స్క్వాడ్ ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేశామని, అందుకోసమే 41 సీఆర్‌పీసీ నోటీసు జారీ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు. నోటీస్‌కు రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలన్నామని అరెస్టు చేసే ఉద్దేశం లేదని ఇన్‌సెక్టర్ తెలిపారు.

### కనీస జాగ్రత్తలు తీసుకోని పోలీసులు

మార్కెట్ పోలీసులకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నాకు వస్తారని సమాచారం ఉన్నా జాగ్రత్తలు తీసుకోలేదు. బారికేడ్‌ల ఏర్పాటు, అదనపు ఫోర్సును ఏర్పాటు చేసుకోలేదు. 41 సీఆర్‌పీసీ నోటీస్‌కు వివరణ ఇవ్వడానికి పది మంది లోపు వస్తారని అనుకున్నారు. అందుకు భిన్నంగా సుమారు 150 మందికి పైగా ర్యాలీగా వచ్చి, ఇన్‌స్పెక్టర్ గదికి దూసుకెళ్తుండటంతో సిబ్బంది అడ్డుకున్నారు.

## అతివేగం.. డివైడర్‌ను ఢీకొన్న కారు

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అతివేగంగా కారు నడిపుతూ డివైడర్‌ను ఢీకొట్టి ఓ వ్యక్తి గాయాలపాలైన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నెల్లూరు ప్రాంతానికి చెందిన టి.ప్రసాద్ క్యాబ్‌డ్రైవర్. యూసుఫ్‌గూడలోని హాస్టల్‌లో ఉంటున్నాడు. గురువారం తెల్లవారుజామున నిద్ర మత్తులో యూసుఫ్‌గూడ బస్తీవైపు వేగంగా కారు నడిపి డివైడర్‌ను ఢీకొట్టాడు. అతనికి స్వల్పగాయాలు అయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# సనత్‌నగర్ ఫైర్‌స్టేషన్‌కు సొంత భవనం

**● త్వరలో అందుబాటులోకి.. ● 30 ఏళ్ల నుంచి అద్దె భవనంలోనే నిర్వహణ**

సనత్‌నగర్ ఫైర్ స్టేషన్ త్వరలో కొత్త భవనంలోకి మారనుంది. టీఎస్ఐఐసీ, కార్పొరేట్ సంస్థల సహకారంతో నూతన భవన నిర్మాణం పూర్తయింది. గడిచిన ఐదు దశాబ్దాలుగా అద్దె భవనంలో నిర్వహిస్తున్న ఫైర్ స్టేషన్‌కు త్వరలో మోక్షం కలగనుంది.



నూతన ఫైర్ స్టేషన్ భవనం

సనత్‌నగర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): 1960లో సనత్‌నగర్ ఇండస్ట్రియల్ ఏరియాలో అగ్నిప్రమాదాల నివారణ కోసం ఫైర్‌స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో పారిశ్రామిక కార్యకలాపాలు అధికమవ్వడంతో అగ్నిప్రమాదాలు పెరిగాయి. గతంలో ఈ పోలీస్టేషన్ పరిధిలో కూకట్‌పల్లి, మియాపూర్, బోరబండ, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, అమీర్‌పేట, బేగంపేట, బాలానగర్, షాపూర్, జీడిమెట్ల తదితర ప్రాంతాలుండేవి. ఈ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు జరిగితే సనత్‌నగర్ ఫైర్‌స్టేషన్ నుంచి ఫైర్ ఇంజన్లు వెళ్లి మంటలను అదుపుచేసేవి. కాలక్రమేణా కొత్తఫైర్‌స్టేషన్లు అందుబాటులోకి రావడంతో ప్రస్తుతం బాలానగర్, మూసాపేట, బోరబండ, మోతీనగర్, అమీర్‌పేట ప్రాంతాలకు సనత్‌నగర్ ఫైర్‌స్టేషన్ సేవలు పరిమితమయ్యాయి. ఏదైనా పెద్ద అగ్నిప్రమాదం సంభవిస్తే సనత్‌నగర్ ఫైర్‌స్టేషన్ నుంచి ఇతర ప్రాంతాలకు కూడా సేవలందిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో అగ్నిప్రమాదం జరిగినప్పుడు ఫైర్‌సిబ్బంది తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలను కాపాడిన సందర్భాలు కూడా ఉన్నాయి. సనత్‌నగర్ ఫైర్ స్టేషన్ సిబ్బంది చేసిన సేవలకు గాను పతకాలు కూడా లభించాయి. ఇంత చరిత్ర ఉన్న సనత్‌నగర్ ఫైర్‌స్టేషన్ అద్దె భవనంలో నిర్వహిస్తుండటంతో సిబ్బంది, అధికారులు అరకొర వసతుల మధ్య విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు సరైన వసతి సదుపాయం లేక సతమతమవుతున్నారు.

### సీఎస్ఆర్ నిధులతో..

అగ్నిమాపకశాఖ అధికారులు ప్రయత్నాలు, విజ్ఞప్తుల ఫలితంగా టీఎస్ఐఐసీ సనత్‌నగర్ ఫైర్‌స్టేషన్‌కు 450 చదరపుమీటర్ల స్థలాన్ని కేటాయించింది. భవన నిర్మాణానికి నిధుల మంజూరులో జాప్యం జరగడంతో ఈ సమయంలో కొన్ని కార్పొరేట్ సంస్థలు తమ సీఎస్ఆర్ నిధులను ఇచ్చేందుకు ముందుకు వచ్చాయి. ఈ సహకారంతో జీ+1 భవనానిన్ని నిర్మించారు. ఇందులో రెండు పెద్ద ఫైర్‌ఇంజన్లు, మీడియం, రెండు చిన్నఫైర్ ఇంజన్ల పార్కింగ్ కోసం స్థలం కేటాయించారు. పై అంతస్తులో అధికారులకు, స్టోర్ రూమ్, సిబ్బంది వసతి ఏర్పాట్లు చేశారు.

### షెల్టర్‌లో తొలుత

సనత్‌నగర్ ఫైర్‌స్టేషన్ ప్రారంభించిన సమయంలో కేవలం ఒక ఫైర్ ఇంజన్ ఉండేది. ఆ సమయంలో ఓల్టాస్ సంస్థ స్థలంలో షెల్టర్ ఏర్పాటు చేశారు. ఓల్టాస్ సంస్థ కార్యకలాపాలు నిలిచిపోవడంతో ఫైర్‌స్టేషన్ భవనాన్ని ఎదురుగా ఉన్న ప్రైవేట్ భవనంలోకి మార్చారు. 30 సంవత్సరాల పాటు ప్రైవేట్ వ్యక్తులకు అద్దె చెల్లిస్తూ నిర్వహించారు. అద్దె చెల్లిస్తున్నప్పటికీ ఫైర్‌స్టేషన్‌కు సరిపోను స్థలం లేక ఇబ్బందులు పడుతూనే పని చేశారు. ఈ భవనంలో ఫైర్‌ఇంజన్‌లు నిలిపేందుకు సరైన స్థలం లేదు. సిబ్బందికి సరిపడా సౌకర్యాలులేవు. కనీసం సిబ్బంది కాలకృత్యాలు తీర్చుకునేందుకు కూడా సరైన ఏర్పాట్లు లేవు. కొత్త భవనం ఏర్పాటుకు స్థలం లేకపోవడం, ప్రధానరహదారిపై ఉండటం వంటి కారణాలతో ఇంత కాలం కార్యాలయాన్ని మార్చకుండా నెట్టుకొస్తున్నారు. ఈ భవనంలో కొంతభాగం కూడా రోడ్డు విస్తరణలో కోల్పోవడంతో ఫైర్ ఇంజన్‌లు రోడ్లపైకి వచ్చాయి. సిబ్బందికి టీఎస్ఐఐసీ కార్యాలయంలో తాత్కాలిక ఏర్పా ట్లు చేశారు. ప్రస్తుతం ఈ ఫైర్ స్టేషన్‌లో ఎస్ఎఫ్ఓ, 2డీఓపీలు, నలుగురు లీడింగ్ ఫైర్‌మెన్‌లు, ఇద్దరు హోంగార్డులు పనిచేస్తున్నారు.

### త్వరలోనే ప్రారంభిస్తాం

సనత్‌నగర్ ఫైర్ స్టేషన్ కొత్త భవన నిర్మాణం దాదాపు పూర్తయింది. దీన్ని త్వరలోనే ప్రారంభించేందుకు ప్రయత్నం చేస్తున్నాం. అన్ని సౌకర్యాలూ అందుబాటులోకి వచ్చాయి. ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దలు ప్రారంభించేలా ఏర్పాటు చేస్తున్నాం. వారి సమయం కోసం వేచిచేస్తున్నాం.

- మధుసూదన్‌రావు, డీఎఫ్ఓ

### ఆనందంగా ఉంది



సనత్‌నగర్ ఫైర్‌స్టేషన్‌కు కొత్త భవనం అందుబాటులోకి రావడం ఆనందంగా ఉంది. దీనికోసం ఉన్నతాధికారులు ఎంతో ప్రయత్నం చేశారు. కార్పొరేట్ సంస్థలు ఎంతో సహకారమందించాయి. వారందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నాను. నా హయాంలోనే కొత్త కార్యాలయం రావడం ఆనందంగా ఉంది.

- ప్రదీప్, ఫైర్ ఆఫీసర్

## వైద్యరత్న అవార్డుల పోస్టర్ ఆవిష్కరణ



వైద్యరత్న అవార్డుల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

బంజారాహిల్స్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వైద్యరంగంలో విశిష్ట సేవలు అందించిన వైద్యులకు వైద్యరత్న అవార్డులు ఇచ్చి సత్కరించటం శుభపరిణామమని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. గురువారం ఆయన కార్యాలయంలో 2024 సంవత్సరానికి వైద్యరత్న అవార్డుల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యుల సేవలను గుర్తించి వారికి వైద్యరత్న అవార్డులు అందించే కార్యక్రమం ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న జేఎంజీ గ్రూప్స్ కృషి ప్రశంసనీయమన్నారు. జేఎంజీ గ్రూప్స్ సీఈఓ ఎం.జగన్ మాట్లాడుతూ 2015 నుంచి వైద్యరత్న అవార్డులను అందిస్తున్నామని, కరోనాలో విశిష్ట సేవలు అందించిన వైద్యులను ఘనంగా సన్మానించామన్నారు. ఈ సంవత్సరం అవార్డులకు ఇప్పటికే నామినేషన్ ప్రక్రియ మొదలైందని, ఈనెల 29 వరకు కొనసాగుతుందని, మార్చి 21న వైద్యరత్న అవార్డుల ప్రధానోత్సవం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఎంజీ గ్రూప్స్ డైరెక్టర్ నీలిమ, పవన్, యూఆర్ఆర్ గ్రూప్స్ ఎండీ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి, ఐకానిక్ ఎండీ శ్రీనివాసగౌడ్, వెరోనిక ఈవెంట్స్ ఎండీ సుమన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్

## కష్టపడి చదివితే తప్పక విజయం: కలెక్టర్

హైదరాబాద్‌సిటీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివితే విజయం తప్పక వరిస్తుందని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్-2లోని ఎన్‌బీటీనగర్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థి జీవితానికి పునాది లాంటిదన్నారు. గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టులపై దృష్టి పెట్టాలని, స్లిప్పు టెస్టులు, మాక్‌టెస్ట్‌లు ఎక్కువగా ప్రాక్టీస్ చేస్తేనే పరీక్షలపై భయం పోతుందన్నారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలన్నారు. అనంతరం కలెక్టర్ వెస్ట్ మారేడ్‌పల్లి మహేంద్రహిల్స్‌లోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల, జూనియర్ కాలేజీని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి రోహిణి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యాదయ్య, సికింద్రాబాద్ ఆర్డీఓ రవికుమార్ పాల్గొన్నారు.



న్యాక్నో పాఠశాలను సందర్శించిన డీఈఓ రోహిణి

## పది పరీక్షలపై దృష్టి పెట్టండి

బోరబండ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మార్చి 18 నుంచి జరిగే పదో తరగతి వార్షిక పరీక్షలపై దృష్టి కేంద్రీకరించి పదిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖధికారి రోహిణి అన్నారు. గురువారం బోరబండ న్యాక్నో పాఠశాలను ఉప విద్యాశాఖధికారి శ్యామ్యూల్ రాజ్, బోరబండ సీఐ కె.ఆదిరెడ్డితో కలిసి ఆమె సందర్శించారు.

విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణించాలని సీఐ ఆదిరెడ్డి తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఆటలపోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాధానోపాధ్యాయురాలు గీత, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## వాటర్‌బోర్డు యూనియన్ ఆఫీస్‌కు తాళం

**● ఉద్యోగులు, కార్మికులకు అప్పగించాలని వినతి ● వెంటనే తొలగించాలని ఎండీ ఆదేశాలు**

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వాటర్‌బోర్డు గుర్తింపు సంఘానికి ఎస్ఆర్‌నగర్‌లోని డివిజన్ కార్యాలయ ప్రాంగణంలో కేటాయించిన ఆఫీసుకు తాళం వేసి సీజ్ చేశారు. వాటర్‌బోర్డు గుర్తింపు సంఘమైన వాటర్ వర్క్స్ ఎంప్లాయిని యూనియన్ నుంచి తొలగించిన వ్యక్తులు రెండు రోజులుగా తాళం వేశారు. సీజ్ చేస్తున్నట్లుగా తేదీ, సంతకంతో స్టిక్కర్ సైతం అంటించారు. ఉద్యోగులు, కార్మికుల కోసం కేటాయించిన కార్యాలయాన్ని సీజ్‌చేయడంపై వాటర్‌బోర్డు ఉన్నతాధికారులు విస్మయానికి గురవుతున్నారు. అయితే వాటర్‌బోర్డు గుర్తింపు సంఘం రెండు గ్రూపులుగా చీలిన నేపథ్యంలో ఎవ్వరినీ గుర్తింపు సంఘం కమిటీగా గుర్తించాలనేది కార్మిక శాఖ జాయింట్ కమిషనర్‌కు లేఖ రాశామన్నారు. అక్కడి నిర్ణయానుసారంగా గుర్తింపు సంఘంగా పరిగణిస్తామని, అప్పటి వరకు ఎవ్వరూ ప్రాతినిధ్యం వహించరని వాటర్‌బోర్డు అధికారులు తెలిపారు. ఈ క్రమంలోనే ఎస్ఆర్‌నగర్‌లోని గుర్తింపు సంఘం కార్యాలయానికి తాళం వేయడంతో చర్చనీయాంశంగా మారింది. మరో రెండు నెలల్లో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో కార్మికశాఖ జాయింట్ కమిషనర్ నిర్ణయంపై ఆసక్తి నెలకొన్నది.

### ఉద్యోగులు, కార్మికులకు అప్పగించాలని వినతి

వాటర్‌బోర్డు గుర్తింపు సంఘం ఆఫీసు సీజ్ చేయడంపై వాటర్ వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్ నేతలు గురువారం వాటర్‌బోర్డు ఎండీ సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రమిచ్చారు. వాటర్‌బోర్డుకు సంబంధం లేని వ్యక్తి యూనియన్ ఆఫీసుకు తాళం వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే సంబంధిత వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని అధ్యక్షులు రాజిరెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు మహ్మద్ జహంగీర్ తదితరులు డిమాండ్ చేశారు.

## బంగారంతో ఆయుర్వేద మందు పేరుతో మోసం

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద మందులో బంగారం ఉపయోగించాలని నమ్మించి ఓ నకిలీ వైద్యుడు బంగారం తీసుకుని ఉడాయించిన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలియచేసిన వివరాల ప్రకారం.. కోకాపేట్ ప్రాంతానికి చెందిన సచిన్‌గుప్తా తన తండ్రి రమావతార్ గుప్తాకు వెన్నెముక సంబంధిత వ్యాధి, పక్షవాతం ఉన్నాయి. దీంతో కొంతకాలంగా మణికొండలో ఫిజియోథెరపీ చేయిస్తున్నాడు. అక్కడ అతనికి సుధాకర్ అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. 'ఆయుర్వేద మందుల ద్వారా మీ తండ్రి జబ్బును నయం చేయవచ్చు' అని నమ్మించి భరత్‌మునిని అనే వ్యక్తిని పరిచయం చేశాడు. భరత్‌ముని ప్రతి రోజు రమావతార్‌గుప్తా ఇంటికి వెళ్లి వైద్యం చేసేవాడు. కొద్ది రోజుల తరువాత మధురానగర్ సమీపంలోని బాలాజీ ఆయుర్వేద స్టోర్‌లో ఇంకా మంచి మందులు దొరుకుతాయని చెప్పాడు. అంతేకాకుండా ఆ షాపునకు తీసుకెళ్లి మందులు ఇప్పించాడు. అక్కడ ఆనంద్ అనే వ్యక్తి పరిచయమయ్యాడు. అతను 'పక్షవాతం, వెన్ను సమస్య ఉన్నవారికి బంగారం కలిపిన మందులు వాడితే తప్పకుండా తగ్గుతుంది. ఇందుకోసం కొంత బంగారం మందులో కలపాల్సి ఉంటుంది. ఆ మందు నేను తయారు చేస్తాను. నేనిచ్చిన మందుకు రోగం తగ్గకపోతే 80 శాతం నగదు తిరిగిస్తాను' అని నమ్మించాడు. దీంతో సచిన్‌గుప్తా సుమారు రూ.3.80లక్షల ఖరీదు చేసే బంగారం కొని ఆనంద్‌కు ఇచ్చాడు. నెల రోజులు గడుస్తున్నప్పటికీ ఆనంద్ జాడలేదు. ఫోన్ చేస్తే స్విచ్‌ఆఫ్ వస్తోంది. దీంతో సచిన్‌గుప్తా ఆయుర్వేద స్టోర్‌కు వచ్చాడు. అక్కడ స్టోర్ కూడా లేదు. దీంతో చుట్టుపక్కల వారిని విచారించగా బోర్డు తిప్పి పరారయ్యాడని తెలిసింది. దీంతో సచిన్‌గుప్తా మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



శాస్త్రీయ తేనెటీగల పెంపకంపై జాతీయ సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నిమ్స్ మే ఫ్యాకల్టీ సభ్యులు

## 15, 16 తేదీల్లో శాస్త్రీయ తేనెటీగల పెంపకంపై జాతీయ సదస్సు

పంజాగుట్ట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, జాతీయ తేనెటీగ బోర్డు, జాతీయ తేనెటీగల పెంపకం సంస్థల సహకారంతో యూసుఫ్‌గూడలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్(నిమ్స్ మే)లో శాస్త్రీయ తేనెటీగల పెంపకంపై ఈనెల 15, 16వ తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ ఏర్పాటు చేసిన సమావేశంలో నిమ్స్‌మే ఫ్యాకల్టీ సభ్యులు వీబీ.రాజేంద్రప్రసాద్, శ్రీకాంత్‌శర్మ, డాక్టర్ శిరీష్ కులకర్ణిలు సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించి, వివరాలు వెల్లడించారు. నిమ్స్ మే డైరెక్టర్ జనరల్ డాక్టర్ గ్లోరిస్వరూప, మానేజ్ డీజీ డాక్టర్ పి.చంద్రశేఖర్, కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వశాఖ అదనపు కమిషనర్ నవీన్ కుమార్ పాటిల్, శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చరల్ యూనివర్సిటీ వైస్‌చాన్సులర్ డాక్టర్ బి.నీరజా ప్రభాకర్, ఎఫ్‌సీఆర్ఐడీన్ ప్రియాంకావర్గీస్, తదితరులు పాల్గొంటారన్నారు. ప్రవేశం ఉచితం అని, వివరాలకు, పేర్లు నమోదు చేసుకోవడానికి 040-23633228 నంబర్‌కు ఫోన్‌లో సంప్రదించాలని సూచించారు.

## యాత్ర-2 ప్రేక్షకుల మధ్య ఘర్షణ

### ఐమాక్స్‌లో జగన్, పవన్ అభిమానుల మధ్య ఫైట్

ఖైరతాబాద్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): సినిమా చూసేందుకు వచ్చిన ప్రేక్షకులు చేసిన నినాదాలు ఇరువర్గాల మధ్య గొడవకు దారితీశాయి. గురువారం ప్రసాద్ మల్టీప్లెక్స్‌లో విడుదలైన యాత్ర-2 సినిమా చూసేందుకు వచ్చిన ప్రేక్షకుల మధ్య నుంచి 'జైజగన్' అంటూ కొందరు నినాదాలు చేశారు. ప్రతిగా 'జైపవన్' అంటూ మరికొందరు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన గొడవలో ఇరువర్గాలు ఒకరిపై మరొకరు పిడి గుద్దులు కురిపించుకున్నారు. గొడవ పెద్దగా మారడంతో ఐమాక్స్ సెక్యూరిటీ సిబ్బంది, పోలీసులు వారిని వారించి బయటకు పంపారు. ఈ విషయమై ఐమాక్స్ ప్రతినిధులు డివిజన్ ఏసీపీకి సమాచారం ఇవ్వడంతో పోలీసులు గొడవ విషయమై విచారించారు. ఈ సంఘటనపై ఎలాంటి కేసూ నమోదు చేయలేదని, తమకు ఎలాంటి ఫిర్యాదూ అందలేదని సైఫాబాద్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర తెలిపారు.

## యువకుడిపై దాడి.. దారిదోపిడీ

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): షాపు ముగించుకుని ఇంటికి వెళుతున్న యువకుడిని ఆపి దారి దోపిడీకి పాల్పడ్డ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎర్రగడ్డ శివాజీనగర్‌కు చెందిన రాథోడ్ సురేష్ ఎర్రగడ్డలో ఛాట్‌బండి నిర్వహిస్తుంటాడు. బుధవారం అర్ధరాత్రి షాప్‌ను మూసేసి ద్విచక్రవాహనంపై సోదరుడి ఇంటికి వెళ్తున్నాడు. ఆలీనగర్‌లోకి రాగానే 30-35 ఏళ్ల వయసున్న అగంతకుడు వచ్చి సురేష్ ద్విచక్రవాహనాన్ని ఆపాడు. అనంతరం డబ్బులు ఇవ్వాలని బెదిరించాడు. అసభ్యపదజాలంతో దూషిస్తూ దాడిచేశాడు. సురేష్ వద్ద ఉన్న రూ.1600 తీసుకుని పారిపోయాడు. బాధితుడు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య

ఖైరతాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఖైరతాబాద్ మారుతీనగర్‌లో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌కు చెందిన కామాకుల అశోక్ (33), సౌజన్య దంపతులు రెండు సంవత్సరాల క్రితం ఖైరతాబాద్ మారుతీనగర్‌కు వలస వచ్చారు. అశోక్ పంజాగుట్టలోని సుబేధ ఆస్పత్రిలో వార్డుబాయ్‌గా పని చేస్తుండగా సౌజన్య హౌజ్‌కీపింగ్ పనిచేస్తోంది. మందు తాగే అలవాటు ఉన్న అశోక్ తరచూ భార్యతో గొడవకు దిగేవాడు. గురువారం ఉదయం 9.30 గంటలకు తన ఇంటి సమీపంలో ఉండే బావకు ఫోన్ చేసి తన చేతికి గాయమైందని, ఆస్పత్రి దగ్గర ఉన్నానని చెప్పగా ఆయన బండిపైన అశోక్‌ను ఇంటి వద్ద దిగబెట్టాడు. అప్పటికే ఫూటుగా మద్యం తాగిన అశోక్ గదిలోపలికి వెళ్లి గడియ పెట్టుకున్నాడు. భార్య మధ్యాహ్నం వచ్చి చూడగా తలుపు ఎంతకూ తీయలేదు. అనుమానంతో కిటికీ నుంచి చూడగా అశోక్ ఫ్యానుకు చున్నీతో ఉరివేసుకొని కనిపించాడు. పొరుగువారి సహకారంతో కిందకు దించగా అప్పటికే అతడు చనిపోయాడు. మద్యం మత్తులోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నారు.

## ప్లాట్లు ఇస్తానని డబ్బుతో పరారీ

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్లాట్లు తక్కువ ధరకు ఇస్తానని నగదు వసూలు చేసి, రియల్‌ఎస్టేట్ వ్యాపారి పరారైన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ దుర్గానగర్ ప్రాంతానికి చెందిన గాజుల దేవప్రసాద్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంటాడు. 2021లో శ్రీనివాస్‌నగర్ వెస్ట్‌లో ఉన్న శ్రీధర్ డెవలపర్స్ పేరుతో రియల్‌ఎస్టేట్ కార్యాలయం సంస్థ ప్రతినిధులు మహేశ్వరం వద్ద ఓపెన్ ప్లాట్స్ తక్కువ రేట్లకు ఉన్నాయని నమ్మించారు. దీంతో దేవప్రసాద్ ఆ సంస్థ చైర్మన్ వర్ల కాశీంకు రూ.4.86లక్షలు నగదు చెల్లించాడు. త్వరలోనే రిజిస్ట్రేషన్ చేయిస్తామని చెప్పిన సంస్థ యజమాని ఏడాది దాటినప్పటికీ చేయలేదు. అదిగో ఇదిగో అని కాలయాపన చేస్తుండటంతో గురువారం శ్రీనివాస్‌నగర్‌వెస్ట్‌కు వెళ్లి చూడగా అక్కడ ఉండాల్సిన శ్రీధర్ డెవలపర్స్ రియల్ ఎస్టేట్ సంస్థ కనిపించలేదు. దీంతో మోసపోయానని గ్రహించిన దేవప్రసాద్ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# సనత్‌నగర్ ఫైర్‌స్టేషన్‌కు సొంత భవనం

- 1960 నుంచి అద్దె భవనంలోనే నిర్వహణ
- త్వరలో అందుబాటులోకి..

**సనత్‌నగర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):** సనత్‌నగర్ ఫైర్‌స్టేషన్ త్వరలో కొత్త భవనంలోకి మారనుంది. టీఎస్ఐఐసీ, కార్పొరేట్ సంస్థల సహకారంతో నూతన భవనం నిర్మాణం పూర్తయింది. ఆరు దశాబ్దాలుగా అద్దె భవనంలో నిర్వహిస్తున్న ఫైర్‌స్టేషన్‌కు త్వరలో మోక్షం కలగనుంది. 1960లో సనత్‌నగర్ ఇండస్ట్రియల్ ఏరియాలో అగ్నిప్రమాదాల నివారణ కోసం ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో పారిశ్రామిక కార్యకలాపాలు పెరగడంతో అగ్నిప్రమాదాలు పెరిగాయి. గతంలో ఈ పోలీస్‌స్టేషన్ పరిధిలో కూకట్‌పల్లి, మియాపూర్, బోరబండ, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, అమీర్‌పేట, బేగంపేట, బాలానగర్, షాపూర్, జీడిమెట్ల తదితర ప్రాంతాలుండేవి. ఈ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు జరిగితే సనత్‌నగర్ ఫైర్‌స్టేషన్ నుంచి ఫైర్ ఇంజన్లు వెళ్లి మంటలను అదుపుచేసేవి. కాలక్రమేణా కొత్తఫైర్ స్టేషన్లు అందుబాటులోకి రావడంతో ప్రస్తుతం బాలానగర్, మూసాపేట, బోరబండ, మోతినగర్, అమీర్‌పేట ప్రాంతాలకు సనత్‌నగర్ ఫైర్‌స్టేషన్ సేవలు పరిమితమయ్యాయి. ఏదైనా పెద్ద అగ్ని ప్రమాదం సంభవిస్తే సనత్‌నగర్ ఫైర్‌స్టేషన్ నుంచి ఇతర ప్రాంతాలకు కూడా సేవలందిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో అగ్నిప్రమాదం జరిగినపుడు ఫైర్‌సిబ్బంది తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలను కాపాడిన సందర్భాలు కూడా ఉన్నాయి. సనత్‌నగర్ ఫైర్ స్టేషన్ సిబ్బంది చేసిన సేవలకు గానూ పతకాలు కూడా లభించాయి. ఇంత చరిత్ర ఉన్న సనత్‌నగర్ ఫైర్‌స్టేషన్ అద్దె భవనంలో నిర్వహిస్తుండటంతో సిబ్బంది, అధికారులు అరకొర వసతుల మధ్య విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు సరైన వసతి సదుపాయం లేక సతమతమవుతున్నారు.


నూతన ఫైర్ స్టేషన్ భవనం

### షెల్టర్‌లో ప్రారంభం..

సనత్‌నగర్ ఫైర్‌స్టేషన్ ప్రారంభించిన సమయంలో కేవలం ఒకటే ఫైర్ ఇంజన్ ఉండేది. ఆ సమయంలో ఓల్టాస్ సంస్థ స్థలంలోని షెల్టర్‌లో ఏర్పాటు చేశారు. ఓల్టాస్ సంస్థ కార్యకలాపాలు నిలిచిపోవడంతో ఫైర్ స్టేషన్ భవనాన్ని ఎదురుగా ఉన్న ప్రైవేటు భవనంలోకి మార్చారు. ఈ భవనంలో ఫైర్ ఇంజన్‌లు నిలిపేందుకు సరైన స్థలం లేదు. సిబ్బందికి సరిపడా సౌకర్యాలు లేవు. కనీసం సిబ్బంది కాలకృత్యాలు తీర్చుకునేందుకు కూడా సరైన ఏర్పాట్లు లేవు. అయినప్పటికీ ఫైర్ సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వహిస్తూ వచ్చారు. కొత్త భవనం ఏర్పాటుకు స్థలం లేకపోవడం, ప్రధాన రహదారిపై ఉండటం వంటి కారణాలతో ఇంత కాలం కార్యాలయాన్ని మార్చకుండా నెట్టుకొస్తున్నారు. ఈ భవనం కూడా రోడ్డు విస్తరణలో భాగంగా కొంత భాగం కోల్పోవడంతో ఫైర్ ఇంజన్‌లు రోడ్లపైకి వచ్చాయి. సిబ్బందికి టీఎస్ఐఐసీ కార్యలయంలో తాత్కాలిక ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం ఈ ఫైర్ స్టేషన్‌లో ఎస్ఎఫ్ఓ, 2 డీఓపీలు, నలుగురు లీడింగ్ ఫైర్‌మెన్‌లు, ఇద్దరు హోంగార్డులు పనిచేస్తున్నారు.

### సీఎస్ఆర్ నిధులతో..

అగ్నిమాపకశాఖ అధికారుల ప్రయత్నాలు, విజ్ఞప్తుల ఫలితంగా టీఎస్ఐఐసీ సనత్‌నగర్ ఫైర్‌స్టేషన్‌కు 450 చదరపుమీటర్ల స్థలాన్ని కేటాయించింది. భవన నిర్మాణానికి నిధుల మంజూరులో జాప్యం జరగడంతో ఈ సమయంలో కొన్ని కార్పొరేట్ సంస్థలు తమ సీఎస్ఆర్ నిధులను ఇచ్చేందుకు ముందుకు వచ్చాయి. ఈ సహకారంతో జీ+1 భవనాన్ని నిర్మించారు. ఇందులో రెండు పెద్ద ఫైర్‌ఇంజన్లు, మీడియం, రెండు చిన్న ఫైర్ ఇంజన్, పార్కింగ్ కోసం స్థలం కేటాయించారు. పై అంతస్తులో అధికారులకు, స్టోర్ రూమ్, సిబ్బందికి వసతి ఏర్పాట్లు చేశారు.

### త్వరలోనే ప్రారంభిస్తాం: డీఎఫ్ఓ మధుసూధన్‌రావు

సనత్‌నగర్ ఫైర్‌స్టేషన్ కొత్త భవన నిర్మాణం దాదాపు పూర్తయింది. దీనిని త్వరలోనే ప్రారంభించేందుకు ప్రయత్నం చేస్తున్నాం. అన్ని సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు ప్రారంభించేలా ఏర్పాటు చేస్తున్నాం. వారి సమయం కోసం వేచిచూస్తున్నాం.

### ఆనందంగా ఉంది..



సనత్‌నగర్ ఫైర్‌స్టేషన్‌కు కొత్త భవనం అందుబాటులోకి రావడం ఆనందంగా ఉంది. దీనికోసం ఉన్నతాధికారులు ఎంతో ప్రయత్నం చేశారు. కార్పొరేట్ సంస్థలు ఎంతో సహకారమందించాయి. వారందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నాను. నా హయాంలోనే కొత్త కార్యాలయం రావడం ఆనందంగా ఉంది.

- ప్రదీప్, ఫైర్ ఆఫీసర్


కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, జంపన్నప్రతాప్ తదితరులు

## ముత్యాలమ్మ ఆలయానికి సహకారం అందిస్తా

**బోయినపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):** ముత్యాలమ్మ ఆలయానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని మాజీమంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి పేర్కొన్నారు. బోయినపల్లి బాపూజీనగర్‌లో ముత్యాలమ్మ ఆలయం పునఃనిర్మాణ పనులు పూర్తికావడంతో ఈ నెల 14న ఆలయ ప్రారంభోత్సవం జరుగనున్నది. ఈ క్రమంలో బోయినపల్లికి చెందిన అరుణ్ యాదవ్ అనే దాత ఆలయంలో నూతనంగా సీసీ కెమెరాలను ఏర్పాటుచేశారు. ఈ సీసీ కెమెరాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు, ఆలయ చైర్మన్ జంపన్న ప్రతాప్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం మల్లారెడ్డి మాట్లాడుతూ.. గతంలో తాను మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థిగా నిలుచున్నప్పుడు తనను గెలిపించనట్లుగానే తన కుమారుడు భద్రారెడ్డిని ఎంపిగా గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో దుర్గయ్య, నర్సింహ, అజిత్, శ్రీకాంత్, శంకర్, లక్ష్మణ్, కుమార్, కొమురయ్య ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 10న సనత్‌నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ విజయోత్సవ సభ

**మారేడ్‌పల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):** సనత్‌నగర్ నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ పార్టీ విజయోత్సవ సభ ఈ నెల 10న ఉదయం 10 గంటలకు సికింద్రాబాద్‌లోని మహబూబ్ కాలేజ్‌లో గల ఎస్‌వీఐటీ ఆడిటోరియంలో సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన జరుగుతుంది. ఈ సమావేశానికి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావు ముఖ్య అతిథులుగా, నగరానికి చెందిన పలువురు ఎమ్మెల్యేలు పాల్గొంటారు. నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు.

## టీఆర్‌టీ పార్కులో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటుచేస్తాం


టీఆర్‌టీ పార్కును పరిశీలిస్తున్న కార్పొరేటర్ సామల హేమ

**బౌద్ధనగర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):** సీతాఫల్‌మండి డివిజన్ టీఆర్‌టీ పార్కులో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేస్తామని స్థానిక డివిజన్ కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. గురువారం కార్పొరేటర్ టీఆర్‌టీ పార్కును సందర్శించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుల్ల పద్మారావు గౌడ్ ఓపెన్ జిమ్‌కు నిధులు మంజూరు చేయించారని, ఎన్నికలకోడ్ వలన జిమ్ ఏర్పాటు చేయటం ఆలస్యమయిందని, త్వరలోనే జిమ్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. టీఆర్‌టీకాలనీ అధ్యక్షుడు శేఖర్ పాల్గొన్నారు.


బీజేపీ కేంద్ర కమిటీ పిలుపు మేరకు 'ప్రవాసీ బస్తీ అభియాన్' కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల నుంచి ఎలా లబ్ధి పొందాలో బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధిలోని బూత్ నెంబర్ 88లో ఇంటింటికీ తిరుగుతూ అందరికీ వివరిస్తున్న రాంగోపాల్‌పేట్ కార్పొరేటర్ చీర సుచిత్ర శ్రీకాంత్. కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు రమణ యాదవ్, బన్సీలాల్‌పేట్ బీజేపీ డివిజన్ అధ్యక్షుడు ఉమేష్ ఖండేల్వాల్, ప్రసాద్ యాదవ్, ప్రవీణ్, స్వప్న, కోమల్, నరేంద్ర పాల్, జై కిరణ్, ధనరాజ్ పాల్గొన్నారు

- రాంగోపాల్‌పేట్, ఆంధ్రజ్యోతి

## కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఏ బ్లాక్ అధ్యక్షుడిగా త్రికాల మనోజ్‌కుమార్


అనిల్‌కుమార్ నుంచి నియామక పత్రం తీసుకుంటున్న త్రికాల మనోజ్ కుమార్

**రాంగోపాల్‌పేట్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):** కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఏ బ్లాక్ అధ్యక్షుడిగా త్రికాల మనోజ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం.అనిల్ కుమార్ యాదవ్ మనోజ్ కుమార్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. మనోజ్ కుమార్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలను అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు ఎనుముల రేవంత్ రెడ్డికి, జిల్లా అధ్యక్షులు అనిల్ కుమార్ యాదవ్‌కు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమలకు కృతజ్ఞతలు తెలిపారు.

## మీటర్ రీడింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**తిరుమలగిరి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):** ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మీటర్ రీడింగ్ కార్మికులు గురువారం ఎస్ఈకి వినతి పత్రం సమర్పించారు. గృహలక్ష్మీ పథకంలో భాగంగా రేషన్‌కార్డ్, ఆధార్‌కార్డ్, ఫోన్‌నెంబర్ లింక్ చేయడంతో అదనపు బాధ్యతలు నిర్వర్తించవలసి వస్తుందని, తమకు జీతాలు పెంచాలని అభ్యర్థించారు. అలాగే తమను ఆర్టిజన్‌గా గుర్తించాలని కోరారు.


ఎస్ఈకి మెమోరాండం ఇస్తున్న మీటర్ రీడింగ్ కార్మికుడు


పవర్ బోర్‌వెల్ పనులు ప్రారంభిస్తున్న శ్యామ్ కుమార్

## పెరుమాళ్ హట్స్‌లో పవర్ బోర్‌వెల్ పనులు ప్రారంభం

**తిరుమలగిరి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):** వేసవి కాలంలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టామని కంటోన్మెంట్ బోర్డ్ 7వ వార్డ్ మాజీ సభ్యుడు ప్యారసాని శ్యామ్‌కుమార్ తెలిపారు. ఎమ్మెల్యే లాస్య నందిత మంజూరు చేసిన నిధులతో గురువారం పవర్ బోర్‌వెల్‌ను పెరుమాళ్ హట్స్‌లో ఏర్పాటు చేశారు. బస్తీలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. వార్డ్ పరిధిలో అన్ని ప్రాంతాల్లో నీటి వసతి కల్పనకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమములో బీఆర్ఎస్ పార్టీ నాయకులు రుక్మయ్య ప్యారసాని రాజు పాల్గొన్నారు.

## మహిళ అదృశ్యం

**రెజిమెంటల్‌బజార్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):** కుమారుడు కొట్టడంతో తల్లి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన సంఘటన మార్కెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై కిషన్‌యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. చాపలబాయికి చెందిన వేణు గోపాల్ సెక్యూరిటి గార్డుగా పనిచేస్తున్నాడు. నైట్ డ్యూటికి వెళ్లి రాగా తన భార్య లలిత కనపడలేదు. కుమారుడిని అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడు. పక్కింటి వారిని విచారించగా లలితను రాత్రి మీ కొడుకు కొట్టాడని అందువలన ఇంటి నుంచి వెళ్లి పోయి ఉంటుందని తెలిపారు. దీంతో పలుచోట్ల వెతికినా లలిత ఆచూకి లభించకపోవడంతో మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో భర్త వేణుగోపాల్ ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# డివైడర్లు లేక రక్తమోడుతున్న రోడ్డు


ద్విచక్ర వాహనం ఢీకొన్న కారు

**తిరుమలగిరి ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):** రాజీవ్ రహదారి రక్తమోడుతోంది. ప్రతినిత్యం ఉత్తర తెలంగాణలోని సిద్దిపేట, కరీంనగర్, మంచిర్యాల, వేములవాడ తదితర ప్రాంతాలకు 24గంటలు ఈ రాజీవ్ రహదారి గుండా వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుంటాయి. సుమారు వేలాది వాహనాలు రాకపోకలు కొనసాగించడంతో రాజీవ్ రహదారిపై తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. అతివేగంగా వాహనాలు వెళ్లడం, డివైడర్లు, ప్రమాద సూచికలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రాజీవ్ రహదారిని ఆనుకుని ఉన్న కోటేశ్వర ఆలయం, బొల్లారం చెక్‌పోస్ట్, ఫ్రీడం ఫైటర్ బంగ్లా దగ్గర ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. కొద్దిరోజుల క్రితం కంటోన్మెంట్ పార్క్ వద్ద ముగ్గురు మహిళలు ఉదయం వాకింగ్‌కు వెళ్తుండగా అతివేగంగా వచ్చిన ద్విచక్ర వాహనాదారుడు మహిళలను ఢీకొట్టడంతో ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతి చెందారు.

అలాగే బరోడా బ్యాంక్ ఉద్యోగి డ్యూటీకి వెళ్తుండగా బొల్లారం చెక్‌పోస్ట్ వద్ద అతివేగంగా వచ్చిన కారు ఢీకొట్టడంతో స్పాట్‌లోనే మృతిచెందాడు. ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు నివారణచర్యలు చేపట్టడం లేదని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### కళ్ల ముందు జరిగింది నమ్మలేకపోతున్నాను..



ఇరవై ఏళ్ళుగా బాలమణి, లక్ష్మి, రాధిక, నేను మార్నింగ్ వాకింగ్‌కు కంటోన్మెంట్ బోర్డ్ పార్క్‌కు వెళ్తుంటాం. హఠాత్తుగా కళ్ల ముందు బైక్ ఢీకొని నా ఇద్దరు స్నేహితులు మృతి చెందడంతో హృదయం కలచి వేస్తోంది. మంచి స్నేహితులను కోల్పోయాను. పోలీస్ వర్గాలు, కంటోన్మెంట్ బోర్డ్ అధికారులు సంయుక్తంగా కలిసి ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు చేయాలి.

- మొగుళ్ళ లక్ష్మీదేవి

### ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాం



తిరుమలగిరి చౌరస్తా, లోత్‌కుంటా, అల్వాల్ తెలంగాణ తల్లి చౌరస్తా, బొల్లారం చెక్‌పోస్ట్ చౌరస్తా వద్ద అధికంగా ట్రాఫిక్ జామ్ అవుతుంది. ట్రాఫిక్ నియంత్రించడానికి అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ చర్యలు చేపట్టాం. హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశాం. బొల్లారం చెక్‌పోస్ట్ నుంచి తుంకుంట వైపు డివైడర్‌ను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు లేఖలు అందజేశాము. త్వరలోనే సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నాం.

- మధు బాబు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్


విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎన్.శ్రీగణేష్ తదితరులు

## మాజీ మంత్రి డి.నర్సింగరావు సేవలు చిరస్మరణీయం

**మారేడ్‌పల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):** పేద బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, దివంగత నేత డి.నర్సింగరావు చేసిన సేవలు అపారమని వివిధ రాజకీయ పార్టీల నాయకులు అన్నారు. గురువారం డి.నర్సింగరావు వర్ధంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ సీనియర్ నాయకులు డిఎన్.సంజీవరావు అధ్వర్యంలో ఏర్పాటు చేసిన వర్ధంతి కార్యక్రమంలో అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పికెట్ లక్ష్మీనగర్ ప్రధాన రహదారిలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్, బీజేపీ నాయకుడు ఎన్.శ్రీగణేష్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, లక్ష్మీ నగర్ బస్తీ అధ్యక్షులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

## కష్టపడి చదివితే తప్పక విజయం

**హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):** విద్యార్థులు కష్టపడి చదివితే విజయం తప్పక వరిస్తుందని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నంబర్-2లోని ఎన్‌బీటీ నగర్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పదోతరగతి విద్యార్థి జీవితానికి పునాది లాంటిదన్నారు. గణితం, సైన్స్, సోషల్ సబ్జెక్టులపై దృష్టి పెట్టాలని, పరీక్షల్లో మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలన్నారు. అనంతరం కలెక్టర్ వెస్ట్ మారేడ్‌పల్లి మహేంద్రహిల్స్‌లోని సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాల, జూనియర్ కాలేజీని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి రోహిణి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యాదయ్య, సికింద్రాబాద్ ఆర్డీఓ రవికుమార్, అధికారులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

**బోయినపల్లి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి):** ఓ ఆలయ సమావేశంలో జరిగిన గొడవలో ఓ వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైన సంఘటన బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ బోయినపల్లి హస్మత్‌పేట్ అంజయ్యనగర్ ప్రాంతానికి చెందిన మంద మధుకర్(30)కు మంగళవారం స్థానికంగా ఉన్న శ్రీహనుమాన్ దేవాలయంలో సమావేశముందని కమిటి సభ్యులు చెప్పారు. దీంతో మధుకర్ స్థానికంగా నివసించే అతని స్నేహితుడు బ్యాగరి నర్సింహా(33)ను తీసుకుని దేవాలయానికి వెళ్లాడు. సమావేశం జరుగుతుండగా స్థానికంగా నివసించే వైద్యుడు మర్రి బాలరాజు(55) కులాలను ప్రస్తావిస్తూ మీకు ఇక్కడ ఏమి పని అంటూ మధుకర్, నర్సింహాలను దుర్భాషలాడాడు. అప్పటికీ మధుకర్, బాలరాజును దుర్భాషలాడోద్దని వారించిన అతను వినిపించుకోకుండా కోపోద్రుక్తుడై ఓ ఇటుకరాయిను మధుకర్‌పైకి విసరబోగా అది మల్లికార్జున్ అనే వ్యక్తి తలకు తగిలి గాయాలయ్యాయి. మధుకర్ ఫిర్యాదు మేరకు బుధవారం రాత్రి కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## సంబురంగా జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలు


పోటీల ప్రారంభోత్సవంలో మల్లారెడ్డి తదితరులు

**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి):** రెండు దశాబ్దాల తర్వాత హైదరాబాద్‌లో జరుగుతున్న జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలు గచ్చిబౌలి స్టేడియంలో సంబురంగా ఆరంభమయ్యాయి. గురువారం ఈ పోటీలను మాజీ మంత్రి మల్లారెడ్డి, జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి ప్రారంభించారు. తొలి రోజు పోటీల్లో 20 రాష్ట్రాల నుంచి రెండు వేల మందికి పైగా వెటరన్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. వెటరన్ అథ్లెట్లను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో తానూ స్పోర్ట్స్ ట్రాక్ సూట్‌లో ఇక్కడికి వచ్చానని చెప్పారు. మాస్టర్ అథ్లెట్లను యువత ప్రేరణగా తీసుకుంటే దేశం ఫిట్ ఇండియాగా తయారవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాస్టర్ అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి ప్రభుకుమార్, కోశాధికారి డి.లక్ష్మి, సహాయ కార్యదర్శి లక్ష్మణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి రాష్ట్రస్థాయి చెస్ పోటీలు

**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి):** ఈనెల 10వ తేదీ నుంచి రెండ్రోజుల పాటు తెలంగాణ రాష్ట్ర చెస్ చాంపియన్‌షిప్‌ను హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు రాష్ట్ర చెస్ సంఘం అధ్యక్షుడు కె.ఎస్ ప్రసాద్ తెలిపారు. ఎల్బీ స్టేడియంలోని యోగా హాల్‌లో ఈ పోటీలు జరగనున్నాయని, ర్యాపిడ్, బ్లిట్జ్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇది ఓపెన్ టోర్నమెంట్, తెలంగాణకు చెందిన వారు పాల్గొనవచ్చునని, టాప్‌లో నిలిచిన వారిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని ఆయన తెలిపారు.

# సత్యాగ్రహ దీక్ష చేస్తే కేసులు పెడతారా?

- మార్కెట్ పోలీస్‌స్టేషన్‌లోకి చొచ్చుకెళ్లిన కాంగ్రెస్ కార్యకర్తలు
- ఫ్లైయింగ్ స్క్వాడ్ ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేశాం: మార్కెట్ ఇన్‌స్పెక్టర్


ఇన్‌స్పెక్టర్ రామకృష్ణతో మాట్లాడుతున్న కోట నీలిమ

**రెజిమెంటల్‌బజార్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):** అసెంబ్లీ ఎన్నికల సమయంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహానికి అడ్డుగా బీఆర్ఎస్ ఫ్లెక్సీలు కట్టిన వారిపై కేసు నమోదు చేయాలని సత్యాగ్రహ దీక్ష చేసిన తనపై కేసులు నమోదు చేయడం అన్యాయమని కోట నీలిమ అన్నారు. గురువారం సుమారు 150 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో ధర్నా చేశారు. మోండా మార్కెట్ ఇందిరాగాంధీ విగ్రహం వైపు నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో ర్యాలీగా వచ్చిన కోట నీలిమ మార్కెట్ పోలీస్ స్టేషన్ లోపలికి దూసుకెళ్లడంతో ఉద్రిక్తత ఏర్పడింది. అప్రమత్తమైన పోలీసులు పోలీస్‌స్టేషన్ ప్రధాన ద్వారం డోరు మూసి వేసి అడ్డుకున్నారు. ఫ్లెక్సీలు కట్టిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలుపాలని, సత్యగ్రహ దీక్ష చేసిన తనపై కేసులు నమోదు చేయడంపై కోట నీలిమ ఇన్‌స్పెక్టర్ రామక్రిష్ణను ప్రశ్నించారు. ఫిబ్రవరి 5న హాజరుకావాలని ఉన్న నోటీస్‌ను ఉద్దేశ్య పూర్వకంగా ఆలస్యంగా పంపించడం వలన ఫిబ్రవరి 7వ తేదిన చేరిందని ఆరోపించారు. తనపై ఏడు కేసులు నమోదు చేశారని కోట నీలిమ తెలిపారు. ఎన్నికల సమయంలో ఫ్లైయింగ్ స్క్వాడ్ ఫిర్యాదు మేరకు మోండా మార్కెట్ ఇందిరా గాంధీ విగ్రహం వద్ద ఎన్నికల ప్రచారం కోసం అనుమతి తీసుకుని నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుపై ధర్నా చేసి ప్రజలకు ఇబ్బందులు కలిగించినందుకు కేసులు నమోదు చేశామని, అందుకోసమే 41 సీఆర్‌పీసీ నోటీసు జారీ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు. 41 సీఆర్‌పీసీ నోటీస్‌కు రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని తెలియజేశామని అరెస్టు చేసే ఉద్దేశ్యం లేదని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

### కనీస జాగ్రత్తలు తీసుకోని పోలీసులు

మార్కెట్ పోలీసులకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నాకు వస్తారని సమాచారం ఉన్నా జాగ్రత్తలు తీసుకోలేదు. బారికేడ్‌ల ఏర్పాటు, అదనపు ఫోర్సును ఏర్పాటు చేసుకోలేదు. 41 సీఆర్‌పీసీ నోటీస్‌కు వివరణ ఇవ్వడానికి పది మందిలోపు వస్తారని అనుకున్నారు. అందుకు భిన్నంగా సుమారు 150మందికి పైగా ర్యాలీగా రావడమే కాకుండా నేరుగా ఇన్‌స్పెక్టర్ గదికి వెళ్లడానికి దూసుకెళ్తుండడంతో పోలీస్ సిబ్బంది అడ్డుకున్నారు.

### సనత్‌నగర్‌లో కాంగ్రెస్ శ్రేణుల నిరసన

**సనత్‌నగర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):** ఎన్నికల సమయంలో సనత్‌నగర్ నియోజకవర్గంలో రాజీవ్ గాంధీ విగ్రహానికి అడ్డుగా బీఆర్ఎస్ నాయకుల ఫ్లెక్సీని పెట్టి అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు నరేష్, ఎలిసా, విజయ్‌లు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకుల చర్యను ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేసి, స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినా.. ఆ కేసులో పురోగతి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసన తెలిపినందుకుగానూ కాంగ్రెస్ నాయకులపైనే పోలీసులు కేసు నమోదు చేశారన్నారు. అంతేకాకుండా గురువారం మోండా మార్కెట్ పోలీస్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశామన్నారు. సనత్‌నగర్‌లోని స్వామి టాకీస్ సమీపంలో బీఆర్ఎస్ నాయకుల దిష్టిబొమ్మను దగ్ధంచేసి, నిరసన తెలిపారు.

# 15 నుంచి శాస్త్రీయ తేనెటీగల పెంపకంపై జాతీయ సదస్సు

**పంజాగుట్ట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి):** కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వశాఖ, జాతీయ తేనెటీగ బోర్డు, జాతీయ తేనెటీగల పెంపకం సంస్థల సహకారంతో యూసుఫ్‌గూడలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్(నిమ్స్ మే)లో శాస్త్రీయ తేనెటీగల పెంపకంపై ఈనెల 15, 16వ తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ ఏర్పాటు చేసిన సమావేశంలో నిమ్స్‌మే ఫ్యాకల్టీ సభ్యులు వీటీ.రాజేంద్రప్రసాద్, శ్రీకాంత్‌శర్మ, డాక్టర్ శిరీష్ కులకర్ణిలు సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించి, వివరాలు వెల్లడించారు.

నిమ్స్ మే డైరెక్టర్ జనరల్ డాక్టర్ గ్లోరిస్వరూప, మానేజ్ డీజీ డాక్టర్ పి.చంద్రశేఖర్, కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వశాఖ అదనపు కమిషనర్ నవీన్ కుమార్ పాటిల్, శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చరల్ యూనివర్సిటీ వైస్‌చాన్సులర్ డాక్టర్ బి.నీరజా ప్రభాకర్, ఎఫ్‌సీఆర్ఐడీన్ ప్రియాంకావర్గీస్, తదితరులు పాల్గొంటారన్నారు. ప్రవేశం ఉచితం అని, వివరాలకు, పేర్లు నమోదు చేసుకోవడానికి 040-23633228 నంబర్‌కు ఫోన్‌లో సంప్రదించాలని సూచించారు.



శాస్త్రీయ తేనెటీగల పెంపకంపై జాతీయ సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నిమ్స్ మే ఫ్యాకల్టీ సభ్యులు